సాక్షి
ప్రకాశం
శనివారం | 7 | అక్టోబర్ | 2023



పేదలకు మరింత చేరువగా వైద్యం

పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 8లో..



రుణ విస్తరణే ధ్యేయం

రుణ విస్తరణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల బ్యాంకు అధికారులతో మాట్లాడారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38.9/27.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత అధికం. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

8, 9న ఎస్‌జీఎఫ్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: ఈనెల 8, 9 తేదీల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14, అండర్ 17 బాల బాలికల క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న స్విమ్మింగ్ క్రీడాజట్ల ఎంపిక స్థానిక రాంనగర్ 14వలైనులోని టార్గెట్ డ్రిల్ బేస్ క్యాంప్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. వివరాలకు సెల్: 9666702555 నంబర్‌ను సంప్రదించాలి. రైఫిల్ షూటింగ్ సెలక్షన్స్ స్థానిక నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఎయిర్ రైఫిల్ ఓపెన్ సైట్ ఎయిర్ రైఫిల్ పీప్ సైట్, ఎయిర్ పిస్టల్ అంశాల్లో ప్రతి విభాగంలో ఒక టీం ఎంపిక జరుగుతుంది. వివరాలకు సెల్: 9849076920 నంబర్‌ను సంప్రదించాలి.

9వతేదీ:

స్థానిక హోటల్ కోలాస్ ఎదురుగా ఉన్న అకాడమీలో టేబుల్ టెన్నిస్ క్రీడాజట్ల ఎంపిక ఈనెల 9న ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. వివరాలకు సెల్: 7995163165 నంబర్‌ను సంప్రదించాలి. వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్స్ భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. వివరాలకు సెల్:9666067764 నంబర్‌ను సంప్రదించాలన్నారు. త్రోబాల్ సెలక్షన్స్ పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. పూర్తి వివరాలకు సెల్: 7730004438 నంబర్‌ను సంప్రదించాలి.

ఊళ్లపాలెం తీరంలో సోనాబోట్ల హల్‌చల్



ఊళ్లపాలెం సముద్ర తీరంలో కడలూరుకు చెందిన సోనాబోట్లు

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్రతీరంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్లు శుక్రవారం విజృంభించాయి. ఇప్పటి వరకు 8 నుంచి 14 బోట్ల వరకు తీరంలో హల్‌చల్ చేస్తుండగా ఒక్కరోజు ఏకంగా 45 బోట్లు హల్‌చల్ చేశాయి. మొదట తీరంలో సుమారు 2 కిలోమీటర్ల దూరంలో చేపల వేట సాగించిన సోనాబోట్లు క్రమేపీ సమయం గడిచే కొద్దీ తీరానికి అతి సమీపంలో చేపల వేట సాగించాయి. ప్రస్తుతం సముద్రంలో మత్స్య సంపద బాగానే ఉందని రెండు రోజులుగా చేపల వేట బాగానే ఉందని, కానీ ఈరోజు కడలూరు బోట్ల కారణంగా ఉన్న మత్స్య సంపదను వారి వద్ద ఉన్న భారీ వలలతో దోచేశారని ఇలాగైతే మా పరిస్థితి ఏందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరి లక్ష్యం ఒక్కటే..

వైఎస్ జగన్‌ను రెండోసారి సీఎం చేసుకోవడం

- పేదల కోసం జగన్ ఎన్నో చేశారు
- పచ్చ కుట్రలను తిప్పికొడదాం
- జిల్లాలో అన్ని సీట్లూ గెలుచుకుందాం
- అభ్యర్థి ఎవరనేది జగన్ నిర్ణయిస్తారు
- ఆయన నిర్ణయించిన వారిని గెలిపించుకుందాం
- అసంతృప్తులు సహజం...కానీ వాటికన్నా లక్ష్యమే మిన్న
- కష్టపడే వారికి సీఎం జగన్ దృష్టిలో ప్రత్యేక గుర్తింపు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన జంకె వెంకటరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, బుర్రా మధుసూదన్ యాదవ్, కేపీ నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, అన్నా రాంబాబు, వరికూటి అశోక్‌బాబు, వైఎం ప్రసాద్‌రెడ్డి, శింగరాజు మీనాకుమారి, గంగాడ సుజాత

ఒంగోలు:వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, లబ్ధిదారులందరి ఉమ్మడి లక్ష్యం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎం చేసుకోవడమే అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అభివృద్ధి అంటే గ్రాఫిక్స్ కాదని, పేద ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధి, వారి జీవితాల్లో ఆనందం తాండవించడమే అని అన్నారు. ఆరోగ్యం, విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధితో పాటు పేద విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సీఎం జగన్ పునాదులు వేశారన్నారు. మన రాష్ట్రంలోని 10 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తే నేడు వెయ్యి రూపాయలు వ్యయం దాటిన ప్రతి అనారోగ్యాన్ని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కిందకు తీసుకొచ్చిన ఘనత సీఎందేనన్నారు. ఎమ్మెల్యే స్థాయిలో కూడా చేయలేని పలు కార్యక్రమాలు ఉంటాయని, అంత మాత్రాన వ్యతిరేకత పెంచుకోవడం సరికాదన్నారు. 2024లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే సంక్షేమ పథకాలు అందిస్తామని మనం పేర్కొంటుంటే.. ప్రత్యర్థుల పార్టీలు మాత్రం చొక్కాలు ఊడదీసి కొడతాం, వైఎస్సార్ సీపీ నాయకుల తాటతీస్తామని హెచ్చరించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మన మధ్య ఉన్న చిన్న చిన్న అలకలు వారికి బలం కాకూడదని, మనమంతా ఐక్యతతో ముందుకు వెళితే టీడీపీ నాయకులు కనీసం బజారులో తిరిగేందుకు సైతం వెనుకాడే పరిస్థితి ఉందని అన్నారు. జగన్ అరెస్టయి జైలులో ఉంటే నాడు కోర్టులు న్యాయం చేశాయని అంటూ, నేడు చంద్రబాబు అరెస్టయితే కోర్టులను సైతం ధిక్కరిస్తూ వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకుల శైలిని ప్రజలకు వివరించాలన్నారు. నాడు ఆస్పత్రులకు వెళితే వైద్యం కోసం పడిగాపులుగాచే స్థితి నుంచి నేడు ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఒక నెలలోనే గ్రామస్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు పదవులు ప్రకటిస్తారని, కష్టపడిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నియోజకవర్గానికి ఒక పరిశీలకుని ద్వారా వివరాలు జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు చేరతాయని వివరించారు. మనం ఎవరినీ నిందించాల్సిన అవసరం లేదన్నారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేస్తే ఒప్పు అన్న పచ్చ పత్రికలు నేడు చంద్రబాబు నాయుడ్ని అరెస్టుచేస్తే ఎందుకు తప్పు అంటున్నాయో ఆలోచించుకోమని సూచించాలన్నారు. వలంటీర్ల సహాయ సహకారాలు కూడా తీసుకుంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఓటర్ల జాబితాల పరిశీలనలో నిర్లక్ష్యం ఉండరాదని, ప్రతిఒక్కరూ దానిపై దృష్టిసారించాలని చెప్పారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి అభ్యర్థి ఎవరనేది జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిస్తారని, ఆయన ఎవరిని నిర్ణయిస్తే ఆయనను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో 8కి 8 సీట్లు వైఎస్సార్ సీపీ గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు.

క్రమశిక్షణతో ముందుకు సాగాలి...



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలో అందరూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. ప్రజలకు వైద్యాన్ని కూడా ఇంటివద్దకే అందించడం ద్వారా ప్రాథమిక దశలోనే అనారోగ్య సమస్యలను తుదముట్టించవచ్చని ప్రభుత్వం భావించి నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న మనపై పచ్చమీడియా బురద జల్లడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో సమష్టిగా 175/175 గెలుచుకునేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. తప్పు చేశాడు కాబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లాడని, అది దేవుడు రాసిన రాతని అన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలి...



జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా వెంటాడినా రాష్ట్రంలోని పేద ప్రజలకు రూ.2.50 లక్షల కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పథకాల రూపంలో జమచేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పేద ప్రజలకు అండగా ఉన్నారు కనుకే ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్ మరోమారు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి...



జేసీఎస్ కన్వీనర్ శివశంకరరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఆంధ్రాకు ఎందుకు అవసరం అనే కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాయకులు, కార్యకర్తలకు వివరించారు. చాలామంది సంక్షేమమే కాదని, అభివృద్ధి ఎక్కడ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని, ఈ నేపథ్యంలో వాటన్నింటికీ సమాధానంగా గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని, నేడు చేస్తున్న అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించేలా పుస్తకాలు ముద్రించారని, వాటన్నింటినీ ప్రతి ఇంటికి పంపుతామని తెలిపారు.

ఈ కార్యక్రమం ఆవశ్యకత వాస్తవాలను ప్రజలకు వివరించడం...ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడమే అన్నారు. ప్రతి మండలంలో నాయకుల మధ్య ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుని ఐక్యంగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు ఆదిశేషయ్య, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనాకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబూరావు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు ప్రజల ముందు ఉంచుదాం...



వాస్తవానికి ఈ కార్యక్రమం చూడకపోతే పచ్చ మీడియా చెప్పేదే నిజమేనేమో అనే భావన ప్రజల్లో ఉండడం సహజం. కానీ వాస్తవాలను పరిశీలిస్తే గత ప్రభుత్వం కన్నా ఎన్నో రెట్ల అభివృద్ధి మన ప్రభుత్వంలోనే జరిగింది. ఇదే భావన ప్రజల్లో కూడా కలిగించేందుకు ప్రతి ఇంటికీ చేరుకుందాం.

– బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే

మా బలం..బలగం మీరే



మా బలం, బలగం జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇంకా అనుబంధ సంఘాల నాయకులే. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్నను గెలిపించుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం కృషిచేద్దాం. రాబోయే నెలరోజులు ఎంతో కీలకం. అన్ని వృత్తులకు ఆర్థిక చేయూతనిచ్చి అందరూ తన కుటుంబ సభ్యులే అన్న భావనతో ముందుకు వెళుతున్న సీఎం జగన్ రాష్ట్రానికి ఎంత అవసరమో ప్రజలకు వివరిస్తాం.

– కుందురు నాగార్జునరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

విమర్శించిన వారే సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నప్పుడు నాపై వ్యతిరేకతతో కొంతమంది తీవ్రంగా విమర్శించారు. అయినా ఓర్పుతో భరించా. ఆ సహనం వల్లే నేడు విమర్శించిన వారు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు అనేక పథకాల ద్వారా లక్ష మొదలు రూ.11 లక్షల వరకు కూడా లబ్ధిచేకూరిందంటూ టీడీపీ అభిమానులే చెబుతుంటే నిజంగా పాలన అంటే ఇది కదా అని మురిసిపోయా. అభ్యర్థి ఎవరనేది జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిస్తారు. నాపై కోపం ఉందని పార్టీకి ద్రోహం చేయకండి. అందరం సమష్టిగా ముందుకు సాగుదాం. టికెట్ ఎవరికిచ్చినా అందరం కలిసి గెలిపించుకుందాం.

– వరికూటి అశోక్‌బాబు, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త

కార్యకర్తగా పనిచేసేందుకూ ఇష్టమే..



2019 ఎన్నికల్లో 80 వేలకుపైగా మెజార్టీతో గెలిచా. కానీ నేడు కొంతమంది నాపై వ్యక్తిగతంగా చేస్తున్న విమర్శలు నాకు బాధ కలిగిస్తున్నాయి. ఎమ్మెల్యేగా నన్ను కాదని ఎవరిని జగన్ నిలబెట్టినా ఆ అభ్యర్థిని గెలిపించుకోవడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడం కోసం పార్టీలో కార్యకర్తగా పనిచేస్తా. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అనేది ఒక కార్పొరేట్ ఆస్పత్రి–ధనికులకు మధ్య ఉండే బంధం. అటువంటి బంధాన్ని సామాన్య ప్రజలకు అందిస్తున్న జగన్ ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం. చిన్న చిన్న సమస్యలు పక్కనపెట్టి అందరం కలిసి జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం.

– అన్నా రాంబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే





సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

అర్జీల పరిష్కారం అధికారుల బాధ్యత

- కలెక్టర్ దినేష్ కుమార్

రాచర్ల: జగనన్న చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం బాధ్యత పూర్తిగా అధికారులే తీసుకోవాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల బీసీ భవనంలో శుక్రవారం మండల స్థాయి స్పందన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్జీలు ఏవిధంగా డిస్పోజల్ చేయాలనే ఆలోచనకంటే, ఏవిధంగా వాటిని పరిష్కరించాలో ఆలోచించాలని సూచించారు. అర్జీ ఏదశలోనూ పరిష్కారానికి నోచుకోని పక్షంలో ఆ విషయాన్ని అర్జీదారునికి చెప్పాల్సిన బాధ్యత మండల అధికారులు తీసుకోవాలని వివరించారు. అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచేందుకే మండల స్థాయిలో జగనన్న చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారుల సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. పశ్చిమ ప్రాంతమైన రాచర్ల మండలంలో మొట్టమొదటిసారిగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో స్పందన నిర్వహించామని, దీంతో జిల్లాలోనే అత్యధికంగా రాచర్ల మండలంలో 240 అర్జీలు వచ్చాయన్నారు. ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యలపై వచ్చాయని తెలిపారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్

భూముల ఆన్‌లైన్‌తో పాటు ఒకరి పొలం మరొకరికి ఎక్కించారని, జగనన్న భూ హక్కు పట్టాదారు పాసు పుస్తకాల్లో ఫొటోలు, భూమి ఎక్కువ ఉంటే తక్కువగా నమోదు చేశారని చాలా మంది రైతులు అర్జీలు ఇచ్చారన్నారు. అంతేకాక పంచాయతీల్లో నిధుల కొరత, వీధిలైట్లు, తాగునీటి సరఫరాలపై అర్జీలు వచ్చాయన్నారు. స్థానికంగానే సమస్యలు పరిష్కరించాలనే ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల స్థాయిలో స్పందన నిర్వహిస్తారన్నారు. ప్రతి బుధవారం, శుక్రవారంలో జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

జగనన్న కాలనీ పరిశీలన:

శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండల కేంద్రమైన రాచర్లలోని జగనన్న కాలనీలో నిర్మించుకున్న గృహాలను స్వయంగా పరిశీలించారు. జగనన్న కాలనీలో 18 గృహాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని త్వరగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వారిని తొలగించి వేరే లబ్ధిదారులకు మంజూరు చేసేలా మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్‌కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ సుబ్బారెడ్డి, హౌసింగ్ ఈఈ పవన్‌కుమార్, డీఈ షేక్.ఖదీర్ బాషా, తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్, ఎంపీడీవో కె.కవితా చౌదరి, పలు శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



రాచర్ల జగనన్న కాలనీలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్

బండారుపై భగ్గుమన్న మహిళలు

- మంత్రి రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ అసభ్యకర వ్యాఖ్యలు చేయడంపై పెద్ద ఎత్తున నిరసన
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఒంగోలు: మంత్రి రోజాపై వ్యక్తిత్వ హననం చేసేలా బండారు సత్యన్నారాయణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక చర్చిసెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నా, బండారు సత్యన్నారాయణ లాంటి వారు చివరకు మహిళల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా చేస్తున్న వ్యాఖ్యలను ప్రతి మహిళా ఖండించాలన్నారు. ఒక వైపు 33 శాతం మహిళా రిజర్వేషన్ పార్లమెంట్లో ఆమోదం పొందిందని, తద్వారా త్వరలోనే చట్టసభల్లో 33 శాతం కంటే ఎక్కువగా మహిళలు ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ మహిళలను ఇలా కించపరుస్తూ ఉంటే వారు ఎలా ముందుకు వస్తారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో మహిళలను కించపరచడం ఒక ఫ్యాషన్ అయిపోయిందని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభల్లో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లోను 50 శాతానికిపైగా పదవులు కట్టబెట్టారన్నారు. మంత్రిగా రోజా ఒక మంచి స్థానం సంపాదించుకోవడం టీడీపీకి కంటిలో నలుసులా మారిందని, దానిని తట్టుకోలేక వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా విమర్శలు చేస్తున్నారన్నారు. బండారు సత్యన్నారాయణను అరెస్టు చేసినంత మాత్రాన తాము ఆగమని, ఆయనకు శిక్ష పడేంత వరకు మహిళలు రోజా వెన్నంటి ఉంటారన్నారు. తక్షణమే బండారు సత్యన్నారాయణ బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ మంత్రి రోజాకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక, పార్టీపరంగా ఆమె సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం బాధాకరం అన్నారు. ఇదో అమానుష చర్య అన్నారు. ఇది కేవలం మా పార్టీ నాయకురాలితో ఆగలేదని, చివరకు బ్రాహ్మణిపై అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను కూడా ఖండిస్తున్నామన్నారు. ఏ పార్టీలో ఉన్నవారు అయినా మహిళల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడితే దానిని క్షమించరాదని, అవసరమైతే వారిని రాజకీయ బహిష్కరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ పాల్గొని నిరసన తెలిపారు.



ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు

పేదవారి అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: పేదవారి అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదేవరంపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గృహాన్ని సందర్శిస్తూ పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందుతున్నారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మిస్తామని, కాలువల నిర్మాణానికి ఇంజినీర్స్ అంచనాలు తయారు చేశారని తెలిపారు. గ్రామంలో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులందరికీ పక్కా గృహాలు నిర్మించాల్సిందిగా హౌసింగ్ డీఈ నారాయణరెడ్డిని, ఏఈ పృథ్విని ఆదేశించారు. తమ సమస్యల గురించి పెదదేవరంపాడు మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. తొలుత గ్రామ ముఖద్వారం వద్ద మహిళలు హారతులిచ్చి పుష్పాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయుడు శ్రీరాములు, ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌వో పి.మురళి, ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ మండలస్థాయి, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొనగా నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కటారి శంకర్, చుండూరి రవిబాబు, ఒంగోలు సచివాలయ కన్వీనర్ సోమశేఖర్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్ వాకా బసివిరెడ్డి, పట్టణ, రూరల్ మండల, చింతాయగారిపాలెం, పెద్దదేవరంపాడు వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

ఏడు నెలలకే నిండిన నూరేళ్లు..!

- మట్టిమిద్దె కూలి ఏడు నెలల చిన్నారి మృతి



భవ్యశ్రీ (ఫైల్)

కంభం: మట్టిమిద్దె కూలి ఏడు నెలల పసికందు మృతిచెందిన సంఘటన కంభం మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన పల్లెబోయిన నరసింహారావు గ్రామవలంటీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి రెండేళ్ల క్రితం వివాహం కాగా వారికి భవ్యశ్రీ (7 నెలలు) పాప ఉంది. శుక్రవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా మట్టిమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నరసింహారావు భార్య శ్రావణి, తల్లి సుబ్బమ్మకు చిన్న చిన్న గాయాలు కాగా మంచం మీద పడుకుని ఉన్న భవ్యశ్రీకి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చిన్నారిని గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. ఒక్కగానొక్క కుమార్తె చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.



చిన్నారిపై పడిన మట్టి, దూలాలను తొలగిస్తున్న స్థానికులు

క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు 9వ తేదీలోగా ఇవ్వాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

ఒంగోలు సబర్బన్: వినియోగదారులకు ప్రతి నెలా 9వ తేదీలోగా విద్యుత్ బిల్లులు అందజేయాలని ఆ శాఖ అధికారులను ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఒంగోలు డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలా 9వ తేదీలోగా విద్యుత్ బిల్లులు అందించకపోతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ బిల్లుల విషయంలో వినియోగదారుల అనుమానాలు, అపోహలను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించని సర్వీసులు, మీటర్ల సమస్యపై ఎస్ఈ సమీక్షించారు. నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఒంగోలు ఈఈ పి.శ్రీనివాసులు, ఈఈలు కట్టా వెంకటేశ్వర్లు, ఎం.నాగేశ్వరరావు, వై.గోపాల్‌రావు, డీఈఈలు ఆర్.మోహన్ రావు, అంజిరెడ్డి, ఏఈఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భైరవకోనలో నెల్లూరు జిల్లా అధికారుల ప్రత్యేక పూజలు



సుస్మిత, నిర్మలకు అమ్మవారి వస్త్రాలు అందజేస్తున్న అర్చకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధికారులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుస్మిత, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) చంద్ర, కావలి ఆర్డీవో సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎంపీఓ రాములు, గోపీనాయక్, రాంబాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య తదితరులు జలపాతాన్ని సందర్శించి అనంతరం భైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాదేవి, నగరేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈవో నర్రా నారాయణరెడ్డిల సూచన మేరకు వేద ఆశీర్వచనం చేసి వారికి తీర్థప్రసాదాలు అందజేసి స్వామివార్ల వస్త్రాలను అందజేశారు.

జిల్లా చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా ఆంజనేయులు

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా ఒంగోలు హర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంజనేయులును అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ప్రతినిధులు అభినందించి సన్మానించారు. ఆంజనేయులు మాట్లాడుతూ చెస్ క్రీడలో దేశవ్యాప్త రేటింగ్‌లో జిల్లాను చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ నూకతోటి రవికుమార్, బ్రహ్మయ్య, సాయి రాజేష్, సామ్యూల్, గోపి కృష్టారెడ్డి, సాల్మన్, వెంకట్రావు పాల్గొన్నారు.

పేదలకు మరింత చేరువగా వైద్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



వృద్ధురాలికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమదే..

● కలెక్టర్ దినేష్‌కుమార్,ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేయడమే ప్రభుత్వం లక్ష్యమని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పొదిలి నగర పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని ఏబీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా కలెక్టర్ సందర్శించారు. శిబిరానికి హాజరైన రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు నూతనంగా ఎంపికైన ముగ్గురు ఆయాలకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకానికి రూపకల్పన చేసి ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తే, నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి ఫ్యామిలీ డాక్టరు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో 524 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వాకా వెంకటరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, ఎస్‌కే నూర్జహాన్, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పేరం సుభాష్ చంద్ర బోస్‌రెడ్డి, జాకీర్, పులగొర్ల శ్రీనివాసులు, డాక్టర్లు నర్మద, షాహీదా, సౌజన్య, రవి, హెల్త్ సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై చేపల వేట సామగ్రి

● ఎఫ్‌డీవో ఆషా, మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న వాయల సుమతి

మడనూరు (కొత్తపట్నం): మత్స్యకారులకు 75 శాతం సబ్సిడీపై చేపల వేట సామగ్రి ఇవ్వనున్నట్లు ఎఫ్‌డీవో ఆషా తెలిపారు. కొత్తపట్నం మండలంలోని మడనూరు స్వర్ణాంధ్ర పట్టపుపాలెం తుఫాన్ షెల్టర్‌లో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించి సబ్సిడీపై వేట సామగ్రి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆషా మాట్లాడుతూ రియల్ క్రాఫ్ట్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండి పాత బోటు ఉన్న వారికి కొత్త బోటు, వలలు, ఇంజిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం రూ.5 లక్షల విలువ చేసే సామగ్రి ఇస్తామన్నారు. లబ్ధిదారుడు 25 శాతం చెల్లిస్తే 75 శాతం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అదేవిధంగా లైఫ్ జాకెట్లను కూడా 75 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా వేట సామగ్రి 75 శాతం సబ్సిడీపై ఇవ్వడం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీ మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు 75 శాతం సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. నవంబర్ 21న మత్స్యకార దినోత్సవం రోజు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.విరిత, గ్రామ కాపులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనకే ఐక్యతా విజయపథం

● మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు: కులమతాలకు అతీతంగా పేదరికం నిర్మూలన కోసమే ఐక్యతా విజయపథం పాదయాత్రను తాను చేపట్టినట్లు మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో పేదల సమస్యలు తెలుసుకునేందుకు తడ నుంచి ఆయన ప్రారంభించిన పాదయాత్ర శుక్రవారం నాగులుప్పలపాడు మండలంలోని పలు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు, చిరు వ్యాపారులు, పేదల సమస్యలు తెలుసుకుంటూ 979 కి.మీ పాదయాత్ర పూర్తి చేసుకుని ఈ ప్రాంతానికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అనేక సమస్యలను తన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారన్నారు. పేదల అభివృద్ధికి సమగ్రమైన విధానం తీసుకొచ్చేందుకు ఒక ప్రణాళిక రూపొందించడం జరుగుతోందన్నారు. అందరూ ఒక తాటిపైకి వచ్చినప్పుడే మనకు రావాల్సిన వాటా వస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ వేదిక ద్వారా ఉద్యమం చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ ఉద్యమంలో అన్నివర్గాల పేదలు భాగస్వాములు కావాలని కోరారు. ముగింపు సభ ఈ నెల 9వ తేదీ ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్‌కు గ్రామగ్రామాన ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట ఆయన సతీమణి విజయశ్రీ పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు సత్వర పరిష్కారం

● పోలీస్ స్పందన కార్యక్రమంలో ఎస్పీ మలికాగర్గ్



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు సత్వరం పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది కోసం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సులభతరంగా పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధితో పాటు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సంబంధించిన అన్నిరకాల సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని వెల్లడించారు. సస్పెన్షన్ సమస్యలు మొదలుకుని రిలీవ్, బదిలీ, ఓఏతో పాటు ఇతర సమస్యల గురించి సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. సిబ్బందితో స్వయంగా మాట్లాడి వాటిని పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాదు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, హరిబాబు, స్పందన ఎస్సై సుదర్శన్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

రుణ విస్తరణే ధ్యేయం

● రైతులు, స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు

● పరిశ్రమలు, ఇతర వ్యాపారాలకూ ప్రోత్సాహం

● ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

ఒంగోలు సబర్బన్: రుణ విస్తరణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన బ్యాంకు అధికారులు, కస్టమర్లతో శుక్రవారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీజీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 56 శాఖలతో ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ రెండు జిల్లాల్లో కలిపి రూ.4,080 కోట్ల అధిక వ్యాపార వాటా కలిగి ఉన్నామన్నారు. రూ.2,151 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకునే వారికి రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయేతర రంగాల్లో రుణాలు విరివిగా అందించి ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఒంగోలులో సరళ రుణ కేంద్రాలను ప్రారంభించి, రూ.10 లక్షలు అంతకంటే పైబడిన రుణాలను త్వరితగతిన మంజూరు చేయడానికి డెడికేటెడ్ స్కిల్డ్ స్టాఫ్‌ను నియమించామని పేర్కొన్నారు. అనంతరం ఒంగోలులో ర్యాం కార్నివాల్ కాంపెయిన్‌ను ప్రారంభించారు. నవంబర్ 30వ తేదీ వరకు క్యాంపెయిన్ కొనసాగుతుందని ఏపీజీబీ చైర్మన్ చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజులేకుండా గృహ, వాహన రుణాలను అందించేందుకు పూనుకున్నామని పేర్కొన్నారు.

బ్యాంక్ జనరల్ మేనేజర్ పిర్ పడగేట్వేర్ మాట్లాడుతూ..

ర్యాం కార్నివాల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 90 మంది ఖాతాదారులకు గృహ, వాహన, విద్య, వ్యాపార, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. ఏపీజీబీ సేవలను ఎల్‌డీఎం అబ్దుల్ రహీం కొనియాడారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవికుమార్, బ్యాంకు ఆర్ఎం బి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

● భర్త మృతి, భార్యకు గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమన్



మృతుడు వెంకటరాజు(ఫైల్)

త్రిపురాంతకం: పొట్టకూటి కోసం పనిచేసుకునేందుకు వెళ్తున్న దంపతులను మృత్యువు వెంటాడింది. బైక్‌పై వెళ్తున్న దంపతులను వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం ఉమ్మడివరం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గణపవరం గ్రామానికి చెందిన బత్తుల వెంకటరాజు(40), తిరుపతమ్మ భార్యాభర్తలు. గ్రామంలోని మరికొన్ని కుటుంబాలతో కలిసి నిజామాబాద్ జిల్లాలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలకు స్వగ్రామానికి వచ్చిన వారు శుక్రవారం నిజామాబాద్‌కు బైక్‌లపై తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడివరం వద్ద వెంకటరాజు దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టింది. భర్త మృతి చెందగా తిరుపతమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వినుకొండలోని ఓ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తమ కళ్లెదుటే కన్నుమూసిన వెంకటరాజును చూసి బంధువులు తీవ్రంగా కలతచెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సుమన్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా జట్ల ఎంపిక



షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన బాలబాలికలు

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం అండర్-19 స్కూల్ గేమ్స్ వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. పోటీలను ఆర్ఐఓ సైమన్ విక్టర్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, డాక్టర్ బి.హరిబాబు, టంగుటూరు కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరావు పర్యవేక్షించారు. తొలుత క్రీడాజ్యోతిని వెలిగించారు. భోజన వసతి కల్పించిన దేవి సీఫుడ్స్ కంపెనీ మేనేజర్ గిరిని పీడీ శంకరరావు అభినందించారు.

హాకీ పోటీలకు మైనంపాడు క్రీడాకారులు



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలబాలికలు

చీమకుర్తి: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ శుక్రవారం తెలిపారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాలలో వేరువేరుగా 26 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు వెల్లడించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు అభినందించారు.

ఆర్టీసీ కార్గో ఆదాయం వృద్ధికి చర్యలు

● గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆర్టీసీ సంస్థకు తీవ్ర నష్టం

● మరో నెలరోజుల్లో జీపీఎస్ పెన్షన్ ప్రారంభం

● త్వరలోనే రాష్ట్రంలో 2 వేల ఏసీ బస్సులు

● ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి



గ్యారేజీ వద్ద మొక్క నాటుతున్న రాజారెడ్డి

ఒంగోలు: ఆర్టీసీ కార్గో ఆదాయం ఐదింతలు కావాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో సిబ్బంది, యూనియన్ల నాయకులు, కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ మాట్లాడుతూ.. కార్మికులు ఎప్పుడూ రక్తాన్ని ధారబోసి సంస్థను రక్షించుకునేందుకు కృషి చేసేవారన్నారు. అయితే గత పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఆర్టీసీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. 1989 నాటికి ఆర్టీసీ కార్మికులు ఎలక్ట్రిసిటీ, ఎన్‌జీవోలకంటే హెచ్చుజీతాలు పొందారని, కానీ ప్రభుత్వాలు, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వల్ల వారి కంటే అట్టడుగున ఉండిపోయామన్నారు. ఆర్టీసీకి చేయూతనిచ్చిన వారు ఎవరైనా ఉన్నారు అంటే అది కేవలం ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని గుర్తు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం 2 వేల ఏసీ బస్సులు కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారన్నారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీ 9 వేలకోట్ల అప్పులో కూరుకుపోయిందని, ఏటా రూ.450 కోట్ల వడ్డీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అప్పు రూ.2900 కోట్లు మాత్రమే ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు జీపీఎస్ పెన్షన్ మరో నెలరోజుల్లో అమలు చేయనున్నట్లు చెప్పారు. కరోనా కష్ట సమయంలోనూ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు జీతాలు అందుకున్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్ నిధులు వాడుకోగా వాటిని సైతం ప్రస్తుత ప్రభుత్వం తిరిగి చెల్లించిందని, తద్వారా దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే రుణం పొందగలుగుతున్నారన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆర్టీసీ కార్గో ఆదాయం రూ.250 కోట్లుగా భావించామని, ఇప్పటి వరకు రూ.202 కోట్ల లక్ష్యాన్ని చేరుకున్నామని వెల్లడించారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్గో ఆదాయం రూ.వెయ్యి కోట్లు రాబట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పీటీడీ ఆఫీసర్ బి.సుధాకర్, ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసులు, ఏటీఎం సురేష్, కార్గో వృద్ధికి నియమితులైన కమిటీ సభ్యులు సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజారెడ్డిని ఆర్టీసీలోని వివిధ యూనియన్ల నాయకులు ఘనంగా సత్కరించి, కార్గో వృద్ధికి సహకరిస్తామని చెప్పారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

దర్శి(తాళ్లూరు): తాళ్లూరు మండలంలోని రామభద్రాపురం గ్రామంలోని ఆవుల షెడ్డులో గతనెల 15వ తేదీ జరిగిన హత్యలో నిందితుడైన బాలుడిని శుక్రవారం ఒంగోలు రైల్వేస్టేషన్లో అరెస్టు చేసినట్లు దర్శి సీఐ జె.రామకోటయ్య తెలిపారు. కేసు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని ముజఫర్ జిల్లా సకడా తాలూకాకు చెందిన రాజన్‌పాశ్వాన్(21) బతుకుదెరువు కోసం తాళ్లూరు మండలంలోని రామభద్రాపురం గ్రామంలో సారెడ్డి వెంకటరెడ్డి వద్ద ఆవుల షెడ్డులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బీహార్ నుంచి ఓ బాలుడు ఇంట్లో గొడవపడి ఆంధ్రాకు వచ్చాడు. తెలిసినవారి వద్ద అద్దంకిలో 12 రోజులు, తూర్పు గంగవరంలో 13 రోజులు ఉన్నాడు. ఎక్కడా పని దొరకకపోవడంతో అతని స్నేహితుడి ద్వారా రామభద్రాపురంలోని కైలాశ్‌కుమార్ వద్దకు చేరాడు. అక్కడ 7 రోజులు ఉండి కైలాశ్ పనిచేసే షెడ్డు పక్కన ఉంటున్న రాజన్‌పాశ్వాన్‌తో పరిచయం పెంచుకున్నాడు. డబ్బు చోరీ చేయడంతో కైలాశ్ అతనిని వెళ్లగొట్టాడు. అప్పటి నుంచి రాజన్‌పాశ్వాన్ దగ్గర ఉంటూ రూ.300 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగివ్వకపోవడంతో రాజన్‌పాశ్వాన్ బూతులు తిట్టి గొంతుపట్టుకోగా బాలుడు ఇనుపరాడ్డుతో తలపై మోదాడు. దీంతో పాశ్వాన్ మరణించాడు. వెంటనే కై లాష్ వద్దకు వెళ్లి రాజన్‌పాశ్వాన్‌తో గొడవపడి కొట్టాను, సెంటర్ వరకు బైక్‌పై వదిలిపెట్టాలని కోరాడు. తూర్పుగంగవరం వరకు వదిలిపెట్టడంతో అక్కడ నుంచి ఒంగోలుకు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ వద్ద ఉంటున్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. కేసును ఛేదించిన సీఐ జె.రామకోటయ్య, తాళ్లూరు ఇన్‌చార్జి ఎస్సై యు.కృష్ణయ్య, సిబ్బందిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.